క్లుప్తంగా

విద్యార్థుల్లో నైపుణ్యాల మెరుగునకు చర్యలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓలు ప్రసాద్, బోడంనాయుడు, సీడీపీవో రమణి

చింతపల్లి: విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలను సాధించాలని చింతపల్లి మండల విద్యాశాఖ అధికారులు ప్రసాద్, బోడంనాయుడులు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఐసీడీఎస్ పీవో రమణి, సూపర్‌వైజర్లు, రిసోర్సు పర్సన్లు శశికుమార్, పాత్రుడు, మునిబాబు పాల్గొన్నారు.

25 నుంచి అమ్మవారి ఉత్సవాలు

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ సంగులోయ గ్రామంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నాగదేవత మహాశివ రాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల్లో ప్రత్యేక పూజలు, భజన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26న అమ్మవారి ఘటాల ఊరేగింపు, కోలాట ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 27న ధ్యానం, ఆధ్యాత్మిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో ప్రతి రోజూ భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



ప్రత్యేకాలంకరణలో సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలు

జి.మాడుగుల: మండలంలో కుంబిడిసింగి పంచాయతీ గద్దరాయి గ్రామంలో బుధవారం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన తలశీల శివరామకృష్ణప్రసాద్ విగ్రహాలను (విగ్రహదాత) గద్దరాయి గ్రామస్తుడు జగ్గం దొర మురళీకృష్ణకు అందజేశారు. గ్రామంలో మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామపెద్ద జగ్గందొర సూర్యనారాయణ(పూజారి), ఆలయ కమిటీ నాయకులు హరిబాబు, కరుణానిధి, ప్రహ్లాద్, లక్ష్మణ్, దయానిధి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



దేముడు (ఫైల్)

కొయ్యూరు: మండలంలోని బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తుచ్చ దేముడు(47) బుధవారం గుండె పోటుతో నర్సీపట్నం ఆస్పత్రిలో మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారని, గుండెనొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించినట్టు బంధువులు తెలిపారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు పేర్కొన్నారు. ఆయన మృతికి ఎంఈవోలు-1, 2లు రాంబాబు, నాగ భూషణం తదితరులు సంతాపం ప్రకటించారు. ఆయన స్వగ్రామం పెద మాకవరంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పేదల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు

పాడేరు: పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల బీజేపీ ఎమ్మెల్యే నెల్లిమర్ల ఈశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం పాడేరు పర్యటనకు వచ్చారు. పాడేరు మోదకొండమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సన్మానించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం స్థానిక మోదకొండమ్మ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతి కుమారి అధ్యక్షతన జరిగిన కేంద్ర బడ్జెట్‌పై చర్చాగోష్ఠి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పలు పథకాలు, అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ప్రయోజనం చేకూర్చేలా నిధులు కేటాయింపు జరిగిందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్, ప్రతినిధులు పి.రాజారావు, ఎస్.రామకృష్ణ, రాఘవేంద్రరావు, మత్స్యకొండబాబు, గోపాలపాత్రుడు, భాస్కర్, దేవదాస్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మోక్షమెన్నడో?

దశాబ్దాల తరబడి మన్యంలో కనీసం మరమ్మతుకు నోచుకోని రహదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మోక్షం కలిగింది. ఎవరూ ఊహించని విధంగా శివారు గ్రామాలకు రహదారులు వచ్చాయి. మన్య ప్రాంతాభివృద్ధికి గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. మన్యంలో మరింత అభివృద్ధికి నిధులు మంజూరైనా ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విశాఖ మన్యంపై కన్నెత్తి చూడలేదు. ఇటీవల రెండు, మూడు దఫాలుగా వచ్చిన తుపాన్ల వల్ల మన్యంలోని చాలా చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. పెద్ద పెద్ద గోతుల ఏర్పడి అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం నేటి వరకు ఒక్క రోడ్డునూ బాగుచేయలేదు.



కామయ్యపేట రహదారి దుస్థితి

- అధ్వానంగా ఆంధ్ర–ఒడిశా సరిహద్దు కామయ్యపేట రోడ్డు
- రాళ్లు తేలి, గోతులతో దర్శనమిస్తున్న రహదారి
- వాహనచోదకులు, ప్రయాణికుల పాట్లు
- పట్టించుకోని అధికారులు

హుకుంపేట: మండల కేంద్రం నుంచి ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతానికి ప్రధానమైన కామయ్యపేట రహదారి అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇరు రాష్ట్రాలకు చెందిన వందలాది వాహనాలు రోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. అంతర్రాష్ట్ర రహదారి రాళ్లు తేలి, గోతులతో దర్శనమిస్తున్నా.. కూటమి ప్రభుత్వ పాలకులు పట్టించుకోకపోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అల్లంపుట్టు గ్రామ సమీపంలో అధ్వానంగా మారిన కామయ్యపేట రోడ్డు



రాళ్లు తేలిన రహదారి

కూటమి పాలనలో పనులు నిల్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకు మండలంలో ఒక్క రహదారి పనులూ ప్రారంభించకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తీగలవలస–మట్టుజోరు రహదారికి మరమ్మతు కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, ఆ పనులూ చేపట్టలేదు. అధ్వాన దారితో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని, అత్యవసర సమయాల్లో పరిస్థితి దారుణంగా ఉందని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీగలవలస పంచాయతీ కిన్నెర్లోవ, గుర్రాలతోట కొండ గ్రామల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.3 కోట్లతో ప్రారంభమైన పనులు ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయాయి. వీటిని కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తి చేసేందుకు ఆసక్తి చూపట్లేదు. దీంతో శివారు గ్రామాలకు అత్యవసర సేవలు అందట్లేదు. గత్యంతరం లేక అత్యవసర సమయంలో గ్రామస్తులు డోలి మోతలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం గిరిజనుల పాలిట శాపంగా మారింది.

నాడు మార్గం సుగమం.. నేడు దారుణం

హుకుంపేట కేంద్రం నుంచి ఆంధ్ర–ఒడిశా సరిహద్దు వరకు 16 కిలోమీటర్లు ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి ఆ ప్రాంతం రహదారికి నోచుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చింది. రూ.కోట్లు వెచ్చించింది. పాములాయి నుంచి కామయ్యపేట వరకు 4.4 కి.మీ., కామయ్యపేట నుంచి తీగలవలస వరకు 4.4 కి.మీ.ల మేర బీటీ రోడ్డు నిర్మించింది. ఇందుకు అప్పటి సీఎం జగన్ ప్రభుత్వం రూ.2.50 కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది. అయితే తీగలవలస నుంచి మట్టుజోరు వరకు 5 కి.మీ. రహదారి మరమ్మతుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ రోజు వరకు రహదారి పనులు చేయలేదు. దీంతో రహదారులు మరింత అధ్వానంగా మారాయి.

అధికారులు స్పందించాలి



కామయ్యపేట రోడ్డు పెద్ద పెద్ద గోతులతో నిండి ఉంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తరచూ ఆటోలు రిపేరవడంతో డ్రైవర్లకు ఆర్థికభారంగా మారింది. ఈ మార్గం మీదుగా అధికారులు ప్రయాణిస్తున్నా మరమ్మతుల గురించి కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– బాబూరావు, ఆటో డ్రైవర్, తీగలవలస గ్రామం

అత్యవసర సేవలకు ఆటంకం



ఆంధ్ర–ఒడిశా ప్రాంతానికి ప్రధాన రహదారి అయినప్పటికీ ఈ రోడ్డు మరమ్మతు కోసం అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. అత్యసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ఈ మార్గంలో ఉన్న గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అంతర్రాష్ట్ర రహదారి సమస్యను పరిష్కరించాలి.

– తామల్ల కోటిబాబు, కామయ్యపేట గ్రామం, హుకుంపేట మండలం

ప్రతిపాదనలు పంపించాం

ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామం కామయ్యపేట ప్రధాన రహదారిలో తీగలవలస గ్రామం నుంచి మట్టుజోరు గ్రామం వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. రోడ్డు మరమ్మతు తదితర పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభిస్తాం.

– సంజీవరావు, పీఆర్ జేఈ, హుకుంపేట మండలం

లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా పనులు



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ రాంబాబు

అడ్డతీగల: లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా పనులు కల్పించాలని ఉపాధి హామీ విభాగం అడ్డతీగల క్లసర్ ఏపీడీ ఎల్.రాంబాబు అన్నారు. అడ్డతీగల క్లస్టర్‌లోని అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం మండలాల ఉపాధి హామీ సిబ్బందికి మండల కేంద్రంలో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీడీ రాంబాబు మాట్లాడుతూ వేతనం రూ.300 వచ్చేలా పనులు చేయించాలని సూచించారు. గ్రామాల వారీగా అనంతరం పంచాయతీల వారీగా ప్రణాళిక తయారుచేసుకుని తదనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. శిక్షణ పర్యవేక్షకుడిగా రంపచోడవరం క్లస్టర్ ఏపీడీ జి.శ్రీనివాస్ హాజరయ్యారు. ఏపీఓలు, జేఈలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు వితరణ

ఎంపీటీసీ, సర్పంచ్‌ల సొంత నిధులతో ఏర్పాటు



కులపాడులో వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ కులపాడు గ్రామంలో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రావిటీ పథకానికి సంబంధించిన వాటర్ ట్యాంక్ పగిలి పోయింది. దీంతో గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానికులు ఎంపీటీసీ సభ్యుడు కె.సత్యనారాయణ, సర్పంచ్ సీదరి కొండబాబుకు విన్నవించారు. వారు స్పందించి తమ సొంత నిధులతో ట్యాంకును సమకూర్చారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఈ మేరకు వాటర్ ట్యాంక్‌ను అందించిన ఎంపీటీసీ, సర్పంచ్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వర్మీ కంపోస్టు యూనిట్ల పరిశీలన



చింతపల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్




సంకాడలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, చిత్రంలో ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు

చింతపల్లి: చింతపల్లిలో ఘనసంపద తయారీ కేంద్రాన్ని డివిజన్‌లోనే నమూనా శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి లవరాజు అన్నారు. మండల కేంద్రంలో ఘనసంపద తయారీ కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఇక్కడ తడి, పొడి చెత్తతో పాటు వర్మీ కంపోస్టు తయారీ యూనిట్‌ను పరిశీలించారు. మండలంలో, ఇతర పంచాయతీ కేంద్రాల్లో సంపద కేంద్రాలన్నింటికీ చింతపల్లి కేంద్రం ఒక మోడల్ కేంద్రంగా తీర్చి దిద్దాలన్నారు. పంచాయతీ పాలకవర్గం దీని నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ఘన సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి లవరాజు అన్నారు. ఆయన మండలంలో బుధవారం పర్యటించారు. సంకాడ, రింతాడ పంచాయతీల్లో ఘనసంపద కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. యూనిట్ల తయారీని పరిశీలించారు. ఈవోపీఆర్డీ పాపారావు, సర్పంచ్‌లు నాగులమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ ఆవిర్భావ దినోత్సవం

చింతూరు: మండలంలోని చట్టిలో గల రెడ్‌క్రాస్ భవనం వద్ద జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. అనంతరం చింతూరు డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి 18 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్రా నాగరాజు మాట్లాడుతూ ఏజెన్సీలో రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి పలువురికి ఉచితంగా రక్తాన్ని అందచేస్తున్నట్టు తెలిపారు. వరదల వంటి విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకుంటున్నామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో రామకృష్ణ, ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు, కార్యదర్శి గౌరీశంకర్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న అధికారులు, సొసైటీ సభ్యులు

సైబర్ నేరాలపై అప్రమత్తం



దబ్బపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ వెంకయ్య

అడ్డతీగల: మండలంలోని దబ్బపాలెంలో బుధవారం సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి సాగు, రవాణా చట్ట రీత్యా నేరమన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. దుశ్చర్తి ఎస్ఐ వెంకయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీఎల్ఎం శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో చదవాలన్నారు. అన్ని భాషలపట్ల పట్టు సాధించాలన్నారు. జాతీయ భాష హిందీ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



పనులను తనిఖీ చేస్తున్న సోషల్ ఆడిట్ సభ్యులు

రాజవొమ్మంగి: పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని ఒట్టిగెడ్డ, దూసరపాము తదితర గ్రామాలను సోషల్ ఆడిట్ టీమ్ బుధవారం సందర్శించింది.ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించింది. స్టేట్ రిసోర్స్ పర్సన్ రాజు, జిల్లా రిసోర్స్ పర్సన్ శ్యామ్, ప్రసాద్‌లు పనుల రికార్డులు తనిఖీ చేశారు. వేతనదారుల మస్తరు, పనుల కొలతలు, పనికి తగిన వేతనం తదితర అంశాలపై ఆరా తీశారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

చింతూరు: మండల కేంద్రంలోని యూత్ ఆధ్వర్యంలో మరాఠా సామ్రాజ్య వీరుడు ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. యువత ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగేశ్వరరావు, బి.పోతురాజు, భాస్కరాచారి, వెంకటరామారావు, కాశీ, సతీష్, విష్ణు,జంపన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య

చింతూరు: మండలంలోని నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, స్థానిక గురుకుల పాఠశాలల్లో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నందున విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడిచేసిన నీటిలో ఓఆర్ఎస్‌ను కలుపుకుని తాగాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. వైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయపై విస్తృతంగా అవగాహన



అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ తదితరులు



హుకుంపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ సూర్యనారాయణమ్మ

అడ్డతీగల: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పండా సతీష్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ఆస్పత్రి కౌన్సెలర్ నారే వాసు ఆధ్వర్యంలో స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ మూడు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, కఫంలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అందుబాటులో ఉన్న ఆశ కార్యకర్తలకు సమాచారమిచ్చి ఆస్పత్రికి రావాలని సూచించారు. తగిన వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడుతుంటే త్వరలో క్షయ వ్యాధి నయమవుతుందన్నారు. స్థానిక సీహెచ్‌సీలో తగిన వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. సూపర్‌వైజర్ జి.లక్ష్మి, వైద్యురాలు ప్రసన్నదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: క్షయ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా టీబీ వైద్యాధికారి డాక్టర్ సూర్యనారాయణమ్మ చెప్పారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్షయ నివారణపై బుధవారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గుతో కఫం ఉండటం, రాత్రిపూట జ్వరం రావడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని సూచించారు. విద్యార్థులకు తమ గ్రామాలకు వెళ్లినపుడు స్థానికులకు టీబీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంధ్య, రామరాజు, పాత్రుడు, సదానందం, అశ్విని, మాగేశ్వరరావు, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు



రికార్డులను తనిఖీ చేస్తున్న పాడేరు ఏడీఏ పాత్రుడు

చింతపల్లి: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుగుణంగానే రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను విక్రయించాలని వ్యవసాయశాఖ పాడేరు ఏడీఈ ఎల్.ఆర్.బి.పాత్రుడు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా చింతపల్లిలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు వంటివి విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చింతపల్లి మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

మండల వీర్వోల సంఘం ఎన్నిక

పెదబయలు: మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నిక బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. వీఆర్వోల సంఘం గౌరవ అధ్యక్షుడు కాతారి సత్యారావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. మండల వీర్వోల సంఘం అధ్యక్షుడిగా డి.కొండబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఆజాద్, కోశాధికారిగా సంధ్యారాణి, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.కేశవకుమారి, సహాయ కార్యదర్శిగా జి.మనోజ్‌కుమార్ ఎన్నికయ్యారు. మండలంలో వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అధ్యక్షుడు కొండబాబు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



లక్ష్మీపురం మాజీ సర్పంచ్ లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొర్రా లక్ష్మి (54) వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుమిడిపుట్టు గ్రామంలో బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, నేతలు గ్రామానికి వెళ్లి లక్ష్మి భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి మనో ధైర్యం చెప్పి, వైఎస్సార్‌సీపీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసిన సర్పంచ్ లక్ష్మి మంచి పేరు తెచ్చుకున్నారని, ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. సర్పంచ్ త్రినాథ్ తదితరులు నివాళులర్పించారు.